Key Area 3 : Transforming teaching learning process

# ప్రధాన రంగం : బోధనాభ్యసన ప్రక్రియల్లో

# అభిలషణీయమైన పరివర్తన

**మాడ్యూల్ పేరు** : విద్యార్థి కేంద్రీకృత బోధనా విధానాలు (Desired Changes in Teaching Learning Process )

**రచయిత** : శ్రీమతి V. పద్మప్రియ,
School Asst.,
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత,
ప్రభుత్వ నెహ్రూ మెమోరియల్ ప్రభుత్వ
ఉన్నత పాఠశాల,
హైద్రాబాద్ జిల్లా.

# విద్యార్థి కేంద్రీకృత బోధనా విధానాలు

## 1.1 అభ్యసన లక్ష్యాలు

ఈ మాడ్యూల్ ఉపాధ్యాయులకు క్రింది విధంగా ఉపయోగపడుతుంది.

i) ఈ క్రింది విద్యార్థి కేంద్రీకృత బోధనా పద్ధతులపై అవగాహన పెంచుకొనుటకు

1) మూవీ క్లబ్

2) మానవత్వాన్ని పెంపొందించే చర్యలు

3) బాల ఉపాధ్యాయులు

ii) విద్యార్థులలో 21వ శతాబ్దపు నైపుణ్యాలను పెంపొందించడానికి అత్యంత అనుకూలమైన బోధనా విధానాలను అనుసరించుటకు.

## 1.2 పరిచయం

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ప్రకారం విద్యా వ్యవస్థ యొక్క ఉద్దేశ్యం – వివేకవంతమైన ఆలోచన మరియు పనిలో సామర్థ్యం గల మంచి మానవులను తయారుచేయడం. క్రమశిక్షణ, నీతి, నిజాయితీ, కరుణ, మానవత్వం, పరోపకారం, ధైర్యసాహసాలు మొదలైన లక్షణాలతోపాటు శాస్త్రీయ దృక్పథం మరియు సృజనాత్మక నైపుణ్యాలను కలిగివున్న మానవులుగా తీర్చిదిద్దడం. మన రాజ్యాంగం సూచించిన విధంగా నైతిక విలువలు కలిగిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దినప్పుడు మాత్రమే సమానమైన, సమగ్రమైన సమాజాన్ని నిర్మించగలుగుతాము.

ఎన్.ఇ.పి. 2020, ఒక మంచి విద్యా సంస్థను నిర్వచిస్తూ, దీనిలో ప్రతి విద్యార్థి స్వాగతించబడ్డారని మరియు తనపై శ్రద్ధవహించే వాతావరణం ఉందని భావించగలగాలి. పాఠశాలలో సురక్షితమైన మరియు ఉత్తేజపరిచే అభ్యసనా వాతావరణం ఉండి, విస్తృత శ్రేణి అభ్యసనా అనుభవాలు అందించబడాలి. మంచి భౌతిక, మౌలిక సదుపాయాలు, అభ్యసనానికి అనుకూలమైన వనరులు విద్యార్థులందరికీ అందుబాటులో ఉండాలి. ఈ క్షణాలను సాధించడము ప్రతి విద్యా సంస్థ యొక్క లక్ష్యం అయి ఉండాలి.

పాఠశాల నాయకుడిగా ప్రధానోపాధ్యాయుడు సంస్థ అభివృద్ధికిగాను, విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు పలు ఎన్.జి.ఓ.ల (NGOs) సహాయ సహకారాలను తీసుకోవలెను. పాఠశాల నిర్వహణ కమిటీ యొక్క ప్రధాన బాధ్యత విద్యార్థులకు సురక్షితమైన అభ్యసన వాతావరణాన్ని సృష్టించడానికి, అవసరమైన మౌలిక సదుపాయాలు మరియు వనరులను సేకరించడం. బోధనా అభ్యసన ప్రక్రియలో 'ఐ.సి.టి.' ని (ICT) అనుసంధానించడానికి, డిజిటల్ పరికరాలను సమకూర్చుకోవలసిన అవసరం ఉంటుంది. పలు సంస్థలు విద్యార్థుల కోసం వారి సి.ఎస్.ఆర్. (CSR) నిధులను అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చే నిధులతోపాటు ఎన్.జి.ఓ.ల సహకారాన్ని అందిపుచ్చుకొని ప్రధానోపాధ్యాయుడు పాఠశాలలో ఆహ్లాదకరమైన అభ్యసన వాతావరణాన్ని విద్యార్థులకు అందించవలసి ఉంటుంది. సంస్థ అధిపతి ఉపాధ్యాయుల ప్రతిభను గుర్తించి, తదనుగుణంగా వారికి బాధ్యతలను

కేటాయించాలి. ఉపాధ్యాయులను ఆన్‌లైన్ పోర్టల్ 'SWAYAM' లేదా MOOC లలో అందించే కోర్సులో చేరి తమ నైపుణ్యాలను నవీకరించుకోవడానికి ప్రధానోపాధ్యాయుడు వారిని ప్రోత్సహించాలి, తాను స్వయంగా ఆన్‌లైన్ కోర్సులో చేరి వారిని ప్రేరేపించాలి. సిబ్బందిలో స్నేహపూర్వక వాతావరణం, పాఠశాలలో సానుకూల వాతావరణాన్ని సృష్టించడంతోపాటు విద్యార్థులకు వినూత్న అభ్యసనా అనుభవాలను అందించడానికి ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తుంది. ఉపాధ్యాయులు పాఠ్య ప్రణాళికలో పొందుపరచిన వినూత్న పద్ధతులను విజయవంతంగా అమలుచేయడం కోసం విద్యార్థి తల్లిదండ్రుల తోడ్పాటును గ్రహించి వారి సహకారాన్ని కోరవలెను. వినూత్న బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థులు నేర్చుకోవడానికి ఎటువంటి అవరోధాలు లేకుండా సానుకూల అవకాశాన్ని కల్పించాలి. విద్యార్థులు 21వ శతాబ్దపు నైపుణ్యాలైనటువంటి

- విశ్లేషణాత్మక ఆలోచన
- సృజనాత్మకత
- భావవ్యక్తీకరణ
- సహకారం
- నాయకత్వ నైపుణ్యాలు
- సామాజిక నైపుణ్యాలు

మొదలగునవి పెంపొందించుకోవాలి. తద్వారా దేశానికి బాధ్యతాయుతమైన పౌరులుగా మారాలి.

విద్యార్థి కేంద్రీకృత బోధనా పద్ధతులపై ఈ మాడ్యూల్ కొన్ని పాఠశాలల్లో అమలుచేసిన క్రింది పద్ధతులను చర్చించడానికి ప్రయత్నిస్తుంది.

1) మూవీ క్లబ్
2) మానవత్వాన్ని పెంపొందించే చర్యలు
3) బాల ఉపాధ్యాయులు

## 1.3 మూవీ క్లబ్

### 1.3.1 అభ్యసన లక్ష్యాలు

1) మూవీ క్లబ్‌పై అవగాహనను పెంపొందించడం.
2) ప్రత్యామ్నాయ తరగతులను (Subsitution Classes) ఫలప్రదంగా ఉపయోగించడం.

### 1.3.2 మూవీ క్లబ్

అనేది పాఠశాలల్లో విద్యార్థుల స్నేహపూర్వక అభ్యసనా వాతావరణాన్ని అందించే ఒక ప్రక్రియ, ఇక్కడ విద్యార్థుల్లో సంభాషణాత్మక మరియు సృజనాత్మక ఆలోచనా నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి అవకాశాలు

కల్పించబడతాయి. ఇది వారిలో శ్రవణ, దృశ్య నైపుణ్యాలను మరియు వారి అభిప్రాయాలను సంకోచించకుండా, భయపడకుండా వ్యక్తీకరించే సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉద్దేశించబడింది. ఇందులో భాగంగా, తరగతి గదిలో విద్యార్థులకు 20 నిమిషాల పాటు వారిని ప్రభావితం చేయగల సందేశాత్మక చలన చిత్రాన్ని చూపించడం జరుగుతుంది. తరువాతి 20 నిమిషాల పాటు కథ మరియు పాత్రలపై చర్చించడం జరుగుతుంది. వారి అభిప్రాయాన్ని నిర్భయంగా వ్యక్తీకరించే వెసులుబాటు కల్పించబడుతుంది. ప్రతి విద్యార్థి చర్చలో పాల్గొనేలా అందరికీ సమానమైన అవకాశాలు కల్పించబడతాయి. ఇక్కడ ఎవరికీ మార్కులు ఇవ్వబడవు. దీనికారణంగా, పిల్లలు తమ భావాలను, అభిప్రాయాలని నిర్భయంగా తోటి విద్యార్థులతో పంచుకోవడం జరుగుతుంది.

ఉదాహరణకు, ''తారే జమీన్ పర్'' సినిమా యొక్క మొదటి 20 నిమిషాలు చూసిన తర్వాత విద్యార్థుల మధ్య చర్చ...

**ఆశా** : ఇషాన్ చాలా అపరిశుభ్రంగా ఉన్నాడు. అతను కలుషితమైన నీటి నుండి చేపలను పట్టుకొని తన వాటర్ బాటిల్‌లో వేసాడు. అది నాకు ఏమాత్రం నచ్చలేదు.

**మహేష్** : ఇషాన్ జంతు ప్రేమికుడు. అతను వీధి కుక్కలతో కూడా చాలా స్నేహంగా ఉన్నాడు. అతను మురికి నీటి నుండి చేపలను సేకరించడానికి కారణం అదే కావచ్చు. తరువాత వాటిని జాగ్రత్తగా అక్వేరియంలో వేయడం మనం చూసాము.

**సంతోష్** : అవును, పిల్లలు ఇషాన్‌ను కొడుతున్నప్పుడు కుక్కలు వారిపై అరిచి ఇషాన్‌పై వాటికి ఉన్న ప్రేమను చూపించాయి.

**ఆశా** : సరే, అతను జంతువులను ప్రేమిస్తాడు. అది మంచి గుణం. కానీ, అతను చాలా నిర్లక్ష్యంగా ఉన్నాడు. అతను కుక్కలు ఆడుకోటానికి తన జవాబు పత్రాలను రోడ్డుపై వేశాడు. ఇది ఏమాత్రం మంచి పద్ధతి కాదు.

**ఈషా** : చదువుకోవడం చాలా ముఖ్యం కదా! అతను చదువుపై దృష్టి పెట్టాలి. అతని సోదరుడు చదువుపై శ్రద్ధ కలిగి ఉన్నాడు. మనం చూశాం, వారి తల్లి అతని మార్కులతో సంతోషంగా ఉంది. తన తల్లిదండ్రులు గర్తించేలా ఇషాన్ కూడా కష్టపడి తన మార్కులను మెరుగుపరుచుకోవాలి.

**మహేష్** : ప్రతి ఒక్కరూ చదువులో ఒకే స్థాయిలో రాణించరు. ఇషాన్ ఆసక్తితో పజిల్ బ్లాకులను అమర్చడంలో నిమగ్నమయ్యాడు.

**ఆశా** : చదువును నిర్లక్ష్యం చేయడం మంచి పని కాదు. అంత అశ్రద్ధగా జవాబు పత్రాలని కుక్కలు ఆడుకోవడానికి విసిరే బదులు, వాటిని తన తల్లికి చూపించి, మార్కులు మెరుగుపరచుకోడానికి ఆమె సహాయం తీసుకుంటే బాగుండేది.

**శివ** : నేను ఇషాన్ సోదరుడిలా ఉండటానికి ఇష్టపడతాను! కష్టపడే తత్త్వం అతనిది.

**టీచర్** : విద్యార్థులారా! చక్కటి చర్చ! మీకు అభినందనలు. ఇప్పుడు, సినిమా తరువాతి భాగంలో ఏమి జరిగి ఉండవచ్చునని మీరు అనుకుంటున్నారు?

**ఆశా** : ఇషాన్‌కి చదువుపై ఆసక్తి లేకపోవడం, జవాబు పత్రాలను విసిరేయడం మరియు అతని నిర్లక్ష్య ధోరణిపై తల్లిదండ్రులకు కోపం రావచ్చు.

**ఇక్బాల్** : ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుంది అని మన టీచర్ ఎప్పుడూ అంటుంటారు. ఇషాన్ చక్కగా పజిల్ బ్లాకులు అమర్చడం మనం చూసాము అందులో అతను రాణిస్తాడేమో!

20 నిమిషాలపాటు ''తారే జమీన్ పర్'' సినిమా చూసిన తర్వాత జరిగిన చర్చ ఇది. గ్రేడిరగ్ జరగలేదు. ఏ విద్యార్థికి మార్కులు ఇవ్వబడలేదు. కథ మరియు పాత్రలపై వారి అభిప్రాయాలను తెలియజేయడం జరిగింది. దానితోపాటు కథ యొక్క తరువాత భాగాన్ని ఊహించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించడం జరిగింది.

మూవీ క్లబ్ అనేది 2017 నుండి హైదరాబాద్‌లోని మలక్‌పేటలోని ప్రభుత్వ నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో అమలులో ఉంది. ఇది విద్యార్థులలో సంభాషణాత్మక మరియు సృజనాత్మక ఆలోచనా నైపుణ్యాలను పెంపొందించడానికి ఉద్దేశించబడిరది. విద్యార్థులకు 20 నిమిషాల పాటు సందేశాత్మక సినిమా చూపించడం జరుగుతుంది మరియు తరువాత 20 నిమిషాలు వారు మార్కుల భయం లేకుండా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తారు. వారు సినిమాలోని పాత్రలు, వారి అభినయం మరియు కథలోని ఇతివృత్తాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. వారు ఇతివృత్తంపై తమ దృష్టికోణంతో ఆలోచిస్తారు మరియు కథలోని పాత్ర ప్రదర్శనపై వ్యాఖ్యనిస్తారు.





విద్యార్థులు తమ తోటి విద్యార్థుల అభిప్రాయంతో ఏకీభవించనప్పుడు వారు ఎదుటి వ్యక్తి దృక్పథాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేలా ఉపాధ్యాయుడు చర్చలో మోడరేటర్ / ఫెసిలిటేటర్‌గా పనిచేస్తాడు. కథ యొక్క తదుపరి భాగాన్ని ఊహించే ప్రక్రియలో విద్యార్థుల సృజనాత్మక నైపుణ్యాలు పెంపొందించబడతాయి. వారు తమ అభిమాన పాత్రల గురించి మరియు పాత్ర యొక్క లక్షణాలనూ తమలో పెంపొందించుకోవడానికి ప్రయత్నిస్తారు.

### 1.3.3 ఉపాధ్యాయుల సంసిద్ధత

ఉపాధ్యాయుడు విద్యార్థుల ఆసక్తిని గమనించి సందేశాత్మక సినిమాను వారి కోసం ప్రదర్శించుటకు ఎంచుకోవాలి. కార్టూన్ సినిమాలు, డాక్యుమెంటరీలు, టెడ్–ఎక్స్ చర్చలు, ప్రభావవంతమైన పిల్లల సినిమాలు ఎంచుకోవచ్చు. స్టాఫ్ మీటింగ్స్‌లో ఉపాధ్యాయులు చర్చించి విద్యార్థులకు ప్రయోజనం కలిగించే సినిమాల

జాబితాని తయారుచేయవచ్చును. ఆ సినిమాలు డౌన్‌లోడ్ చేసుకొని పెట్టుకుంటే ప్రత్యామ్నాయ తరగతులకు (Subsitution Classes) అవసరమైనప్పుడు అందుబాటులో మరియు సిద్ధంగా ఉంటాయి. ఇది ప్రొజెక్టర్ లేదా K-Yan (అన్ని తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో లభ్యమయ్యే పోర్టబుల్ ప్రొజెక్టర్)ని ఉపయోగించి ప్రదర్శించవచ్చు. ఈ విధంగా ప్రత్యామ్నాయ తరగతులను మూవీ క్లబ్ కోసం ఉపయోగించుకంటే ఫలప్రదంగా ఉంటాయి. విద్యార్థులను ప్రోత్సహించడానికి మరియు వారి అభిప్రాయాలను ఓపికతో వినడానికి ఉపాధ్యాయుడు సిద్ధంగా ఉండాలి. తరువాతి పీరియడ్‌కు ఇబ్బంది కలగకుండా, పాఠశాల షెడ్యూల్‌ను అనుసరించడానికి 20 నిమిషాలకు మించకుండా సినిమాని ప్రదర్శించి, తదుపరి 20 నిమిషాలు సినిమాపై చర్చించడం ద్వారా సమయపాలన ఖచ్చితంగా పాటించవచ్చును.

### 1.3.4 విద్యార్థుల సంసిద్ధత

విద్యార్థులకు వారి స్నేహితులతో కలిసి సినిమాను చూసే అవకాశం లభిస్తుంది. వారు ఎటువంటి సంకోచం లేకుండా తమను తాము వ్యక్తం చేసుకోగలిగే అవకాశం లభిస్తుంది కాబట్టి, మూవీ క్లబ్ పీరియడ్‌పై చాలా ఆసక్తిని కనబరుస్తారు.

### 1.3.5 అభ్యసన ఫలితాలు

- విద్యార్థులలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.
- కథలోని పరిస్థితులను విశ్లేషించడం ద్వారా వారి విశ్లేషణాత్మక నైపుణ్యాలు మెరుగుపడతాయి.
- క్రమబద్ధత మెరుగుపడుతుంది.
- విద్యార్థులు ఎటువంటి (మార్కుల) భయం లేకుండా తమ అభిప్రాయాలను వ్యక్తీకరిస్తారు.
- వారి స్నేహితుల అభిప్రాయాలను వినడం మరియు గౌరవించడం నేర్చుకుంటారు.
- ఇతరుల దృక్కోణాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు.
- విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించబడుతుంది.
- వారు తమ ఫార్మాటివ్ అసెస్‌మెంట్‌లో భాగంగా ఉండే ప్రాజెక్టు పనులను ఆత్మవిశ్వాసంతో వివరించగలుగుతారు.

## 1.4 మానవత్వాన్ని పెంపొందించే చర్యలు

### 1.4.1 అభ్యసన లక్ష్యాలు

1) మానవత్వాన్ని విద్యార్థులలో పెంపొందించే చర్యలపై అవగాహన కల్పించడం.
2) పాఠశాలలో వాటిని ఆచరించడం.

### 1.4.2 మానవత్వాన్ని పెంపొందించే చర్యలు ఏవి?

పాఠశాలలో విద్యార్థులు నేర్చుకునే కొన్ని అంశాలు నిగూఢ పాఠ్యప్రణాళికలో భాగమై ఉంటాయి. విద్యార్థుల ప్రవర్తనలు, దృక్పథాలు మరియు వైఖరులు ఇందులో ఇమిడి ఉంటాయి. నిగూఢ పాఠ్యాంశాల నుండి విద్యార్థులు పాఠశాలలో నేర్చుకుంటారని మరియు అవి అధికారిక అధ్యయన కోర్సులో ఒక భాగం కాకపోవచ్చని మనం గ్రహించడం చాలా ముఖ్యం.

తాదాత్మ్యం అంటే ఇతర వ్యక్తులు ఏమి అనుభూతి చెందుతున్నారో అర్థం చేసుకొని వారి సాధక బాధకాలని పంచుకోవడం. ఇది తమకు తాము ఇతరుల స్థానంలో ఉండి ఆలోచించడం ద్వారా ఎదుటివారి మనోభావాలను అర్థం చేసుకుని అనుభూతి చెందగలిగే ఒక భావన.

పిల్లలు సహజంగానే దయ, జాలి, కరుణ మరియు తాదాత్మ్యాన్ని అలవర్చుకుంటారని మనం అనుకుంటాం కాబట్టి ఈ క్షణాలను పాఠశాలలో ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించి నేర్పించాల్సిన అవసరం లేదని అదే సమయాన్ని గణితశాస్త్రం లేదా విజ్ఞానశాస్త్రాన్ని అధ్యయనం చేయడానికి వినియోగిస్తే పరీక్షలలో మార్కులు మెరుగుపడతాయని మనం భావిస్తుంటాం. పిల్లలలో మానవత్వపు విలువలు సహజంగానే అలవడితే, సమాజంలో మన మందరం మరింత దయ మరియు తాదాత్మ్యాన్ని ప్రదర్శించగలిగేవారము.

విద్యార్థులకి పాఠశాల స్థాయిలోనే మానవత్వపు విలువలని, తాదాత్మ్యాన్ని ప్రత్యేకించి నేర్పించాల్సిన అవసరం ఏర్పడదని మనం గ్రహించాలి. నెలకి ఒకసారైనా విద్యార్థులు క్రింద చర్చించబోయే కృత్యాలలో పాల్గొనేలా వారి టైం-టేబుల్‌లో సమయాన్ని కేటాయించితే బాగుంటుంది. ఇంటి వద్ద పిల్లలు ఆన్‌లైన్ ఆటపై ఆసక్తి కనబరుస్తున్నారు. తోటి పిల్లలతో కలిసి ఆటస్థలంలో ఆడుకోవడం తగ్గిపోయింది. వారు ఆటలుగా భావించే విభిన్న కృత్యాలతో వారి ఆలోచన విధానాన్ని మార్చగలిగే ప్రయత్నం చేయవచ్చును.

తరగతి గదులు సంక్లిష్టమైన, సహకార మరియు విభిన్న మనస్తత్వం గల విద్యార్థులు కలిసి ఉండే ప్రదేశాలు, తరగతి గది వాతావరణం ఆకర్షణీయంగా ఉంటే, విద్యార్థులు తమను తాము తమ తోటివారిని అభ్యాసకులుగానే కాకుండా సారూప్యతలు మరియు వ్యత్యాసాలతో ఉన్న వ్యక్తులుగా అంగీకరించి స్వీకరిస్తారు. తరగతి గదియే విద్యార్థుల మధ్య స్నేహాన్ని ప్రోత్సహించి, సమూహ సంస్కృతిని అభివృద్ధిచేసే నిలయం.

మానవత్వపు విలువలని, తాదాత్మ్యాన్ని పాఠశాల స్థాయిలోనే నేర్పడం ద్వారా విద్యార్థులను విజయవంతమైన, దేశ అభివృద్ధికి తోడ్పడే, మంచి పౌరులుగా మార్చగలం.

ప్రభుత్వ నెహ్రూ స్మారక పాఠశాలకి, 2019లో అమెరికాకు చెందిన స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ జక్విలిన్ థర్స్టన్ గారిని ఆహ్వానించడం జరిగింది. జక్విలిన్ గారు పాఠశాల విద్యార్థులను పలురకాల కృత్యాలలో పాల్గొనేలా చేశారు. ఎనిమిదవ తరగతి విద్యార్థిని మానస 'బ్లైండ్ ఫోల్డ్ ఛాలెంజ్'లో పాల్గొన్న చిత్రాన్ని గమనించవచ్చు.



1) బ్లైండ్‌ఫోల్డ్ ఛాలెంజ్ (Blindfold Challenge)

చూపులేని వారి బాధలను విద్యార్థులకు అర్థం చేయించే ప్రయత్నంగా తరగతి గదిలో విద్యార్థులను బ్లైండ్‌ఫోల్డ్ ఛాలెంజ్ కృత్యంలో పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించవచ్చు. స్వచ్ఛందంగా పాల్గొనడానికి ముందుకు వచ్చిన విద్యార్థి కళ్ళకి గంతలుకట్టి, అతనికేమి కనిపించుటలేదు అని నిర్ధారించుకున్నాక తరగతి గదిలోని టీచర్ బల్లవద్ద నుండి వేరొక చివర వరకు నడచి వెళ్ళమని చెప్పాలి. పిల్లలకి ఇది ఒక ఆటలా ముందు అనిపించినా, కళ్ళగంతలతో విద్యార్థి తడుముకుంటూ, ఇబ్బందిపడుకుంటూ, దారిలో అడ్డంగా ఉన్న బల్లల కారణంగా పడిపోతున్నట్టు అనిపించగానే వారిలో ఆలోచన మొదలౌతుంది. ఎక్కడ తన తోటి విద్యార్థికి దెబ్బలు తగులుతాయో అనే బాధ కలుగుతుంది. వారికి సహాయపడాలి అనే ఆలోచన కలుగుతుంది. ఉపాధ్యాయుడు ఆ సమయంలో గంతలతో ఉన్న విద్యార్థికి సహాయపడడానికి అతని స్నేహితుడిని పంపవచ్చును. స్నేహితుని సూచనలతో కళ్ళ గంతలతో ఉన్న విద్యార్థి సులువుగా తన దారిలో అడ్డుగా ఉన్న వస్తువులను, బెంచీలను తగలకుండా చేరవలసిన స్థానానికి చేరుకుంటాడు.

ఈ కృత్యం తరువాత మానస మరియు ఆమె స్నేహితుల మధ్య జరిగిన చర్చ :

**సింధు** : మానస! నీవు నడుస్తూ ఉంటే, ఎక్కడ నీకు బెంచీ తగులుతుందో అని నేను భయపడ్డాను.

**మానస** : అవును సింధు, ఇది మనం ఆడుకొనే సాధారణ ఆటలా ఉంటుందని అనుకుని, ఇందులో పాల్గొనడానికి స్వచ్ఛందంగా వచ్చాను. కానీ నడిచేటప్పుడు నాకు భయం వేసింది.

**వెంకట్** : జాక్విలిన్ మేడమ్ కళ్ళకి గంతలు కట్టిన తర్వాత నీకు ఎలా అనిపించింది సింధు?

**మానస** : చాలా చీకటిగా అనిపించింది, నేను అసలు ఏమీ చూడలేకపోయాను. కళ్ళు లేక చూడలేని వారి బాధలు ఏమిటో బాగా అర్థమయ్యాయి.

**ఫిర్దోస్** : నీవు నడిచేటప్పుడు ఎక్కడ బెంచ్ తగిలి పడిపోతావో అని నేను భయపడ్డాను మానస!

**మానస** : నేను ఎంతో జాగ్రత్తగా చేతులతో తడుముకుంటూ ఏవి నా దారికి అడ్డంలేవని నిర్ధారించుకున్నాకే నడవడానికి ప్రయత్నించాను. అయినప్పటికీ తరగతి గదిలో ఇన్ని బెంచీల మధ్య ఆ చివర వరకు నడవడం సాధ్యపడలేదు.

**ఇన్నాయత్** : దేవునికి ధన్యవాదాలు! జాక్విలిన్ మేడం రాధేశ్‌ని తన సూచనతో నీకు సహాయం చేయమని పంపారు.

**మానస** : నేను రాధేశ్ సహాయంతో నడవగలిగాను. అతను ఇచ్చిన సూచనతో తరగతి గదిలో ఆ చివర వరకు నడవగలిగాను. స్నేహితులారా! నాకు నిజంగా అంధులు ఎదుర్కొంటున్న కష్టాలు అర్థం అయ్యాయి. పదిహేను నిమిషాలు కళ్ళకి గంతలతో నడవడం మనకు కష్టమైతే, ఏ సహాయం లేకుండా వారికి జీవితం ఎంత కష్టమో ఆలోచించండి.

**వెంకట్** : వికలాంగుకు మనం ఎల్లప్పుడూ సహాయం చేయాలి.

**విద్యార్థులందరూ కలిసి** : అవును! మనం వారికి తప్పకుండా సహాయం చేయాలి.

ఉపాధ్యాయుడు పిల్లలందరి ప్రతిస్పందనలు విన్న తరువాత చూపులేని వ్యక్తులకు చేసే చిన్న సహాయం వారికి ఆనందాన్నిస్తుందని వారి పనులను సులువు చేస్తుందని వివరించవచ్చు.

### 2) వన్ హ్యాండెడ్ వాటర్ బాటిల్ ఛాలెంజ్ :

ఉపాధ్యాయుడు విభిన్నంగా ఒక కృత్యంలో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. సీల్‌తో ఉన్న ఒక వాటర్ బాటిల్‌ని వాలంటీర్‌గా ముందుకు వచ్చిన విద్యార్థికి ఇచ్చి, అతను చేయవలసిన కృత్యాన్ని వివరించాలి. వాటర్ బాటిల్ మూతను కేవం ఒక చేత్తో తీయడం – కుడి చేతి వాటం ఉన్న విద్యార్థులైతే ఎడమ చేతితో, అలాగే ఎడమ చేతి వాటం గల విద్యార్థులను కుడి చేతితో బాటిల్ మూతని తీయవలసిందిగా సూచించాలి. వారు ఒకే చేతితో మూత తీసి, బాటిల్‌లోని నీళ్ళని తాగాలి. ఈ కృత్యాన్ని విద్యార్థులు ఒక ఆటలా భావిస్తారు. బాటిల్ మూత ఒకే చేతితో తీయడానికి ప్రయత్నిస్తారు. కొంత సమయం ప్రయత్నించాక వారికి అది చాల కష్టం అనే విషయం అర్థం అవుతుంది. ఉపాధ్యాయులు ఈ సందర్భాన్ని ఉదహరిస్తూ, శారీరక వైకల్యాలు కలిగి ఉండే వారికి తమ రోజువారి పనులు చేసుకోవడం ఎంత కష్టమో వివరించాలి. అలాంటి వారికి మనము సహాయపడవలసిన అవసరాన్ని వివరించాలి. వారిపై జాలితో కాకుండా స్నేహభావంతో ఉండాల్సిన అవసరాన్ని తెలియజేయాలి. ఇలాంటి చిన్న ప్రయత్నాలే పిల్లల మదిలో స్నేహభావాన్ని, మానవత్వాన్ని పెంపొందిస్తాయి. పిల్లలకి పాఠశాల జీవితంలోనే ఇవి నేర్పవలసిన ఆవశ్యకత ఉన్నది. నెలకి ఒక పీరియడ్‌ని కేటాయించినా సరిపోతుంది. ఇదేవిధంగా, ఒకే చేతితో వారి షూలేసుని కట్టుకోమనే కృత్యం కూడా చేయించవచ్చును.

### 3) సంజ్ఞల భాష :

ఉపాధ్యాయుడు విద్యార్థులకు సంబంధించిన కొన్ని వాక్యాలను కాగితాలపై వ్రాసి, వాటిని ఒక బాక్స్‌లో వెయ్యాలి. విద్యార్థి అందులో నుండి ఒకదాన్ని తీసుకుని, మాట్లాడకుండా ఆ వాక్యాన్ని తన స్నేహితులకు సంజ్ఞలతో తెలియజేయాలి. వారు నటన, ముఖ కవళికలను మాత్రమే ఉపయోగించాలి. ఇది కూడా ఒక ఆటలా వారికి ముందు అనిపించి కృత్యంలో సంతోషంగా పాల్గొంటారు. మూగ సంజ్ఞల ఆట వారు ఆడుకునేప్పుడు కేవలం సినిమా పేరు లేదా నటుడి పేరు మాత్రమే ఆటలో భాగమై ఉంటుంది. ఇలా పూర్తిగా కొత్త వాక్యాన్ని తెలియజేయడం చాలా కష్టమని వారికి అర్థమౌతుంది. ప్రతి ఒక్కరూ తమ వంతు

వచ్చినప్పుడు వారి స్నేహితులకు విషయాన్ని సరిగ్గా చెప్పలేకపోవడంతో మూగవారి బాధలను అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తారు. ఈ సందర్భాన్ని ఉపయోగించుకొని ఉపాధ్యాయులు వైకల్యం కారణంగా మాట్లాడలేని వారి ఇబ్బందుల గురించి పిల్లలకి వివరించాలి.

## 4) ధన్యవాదాలు తెలియచేసే పోస్ట్ (Thank you post)

విద్యార్థులు తరగతి గదిలోకి అనుకూలమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆహ్వానించడానికి సహాయపడే మరొక ప్రక్రియ **'ధన్యవాదాలు తెలియచేసే పోస్ట్'.**

తరగతి గదిలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఒక మూలలో ''పోస్ట్‌బాక్స్''ను పెట్టండి. అందుకుగాను సాధారణ కార్డ్‌బోర్డ్ పెట్టె అయిన తీసుకోవచ్చును. విద్యార్థి తాను చిన్న కాగితంపై రాసిన సందేశాన్ని పెట్టెలో వేయడానికి అనుకూలంగా ఉండాలి. తమ స్నేహితుడి కారణంగా తమకు ఆనందాన్ని కలిగించే సందర్భాన్ని, కృతజ్ఞత తెలిపే పదాలు లేదా వారిని ప్రశంసిస్తూ లేదా ప్రోత్సహిస్తూ సందేశాన్ని రాసి పెట్టెలో వేయమని విద్యార్థులకు చెప్పాలి. పేపర్ స్లిప్‌లో వారి పేరుతోపాటు వారి స్నేహితుడి పేరును విద్యార్థులు పేర్కొనాలి. వారు విరామ సమయాన్ని ఇందుకోసం వాడుకోవచ్చును లేదా ఇంటి దగ్గర రాసి తెచ్చి, పోస్ట్ బాక్స్‌లో వేయవచ్చును.

ఉపాధ్యాయుడు తన సౌలభ్యం ప్రకారం క్రింది వానిలో ఏవిధాన్నైనా పాటించవచ్చును.

1) వారానికి ఒకసారి థాంక్ యు పోస్ట్ బాక్స్‌ను తెరిచి విద్యార్థులు రాసిన పోస్ట్‌లను తరగతి గదిలో గట్టిగ చదవవచ్చును. లేదా రోజు కొన్ని చీటీలను తీసుకొని తరగతి గదిలో చదవవచ్చును. ఈ విధంగా స్నేహితులు తమ గురించి రాసిన సందేశాన్ని విద్యార్థులు తెలుసుకోగలుగుతారు.

2) తోటి విద్యార్థులకు ధన్యవాదాలు తెలుపుతూ సందేశాన్ని రాయడానికి వీలుగా వారానికి ఒకసారి ఒక 10 నిముషాలు విద్యార్థులకు వారి పీరియడ్‌లో సమయాన్ని కేటాయించవచ్చును. పోస్ట్‌బాక్స్‌లో వారు వేసిన చీటీని ఉపాధ్యాయులు వారి స్నేహితులకు ఇంటికి వెళ్ళే సమయంలో ఇవ్వవచ్చును. దాన్ని వారు ఇంటి వద్ద సంతోషంతో భద్రపరచుకుంటారు.


## 5) మర్యాద పూర్వకంగా విభేదించడాన్నీ విద్యార్థులకు నేర్పించుట

విద్యార్థులలో తాదాత్మ్యాన్ని పెంపొందించడంలో భాగంగా, ఇతరులు మీ నుండి భిన్నంగా ఆలోచించగలరని వారు గుర్తించేలా చేయాలి. విద్యార్థుల చర్చలో భాగంగా ఏ విషయంలోనైనా ఇద్దరి అభిప్రాయాలు వేరుగా ఉన్నప్పుడు ఇతరుల అభిప్రాయాన్ని అంగీకరించే మరియు గౌరవించే నైపుణ్యాలను నేర్చుకోవడంలో వారికి సహాయపడాలి. తాము ఎదుటి వారి అభిప్రాయంతో ఏకీభవించడంలేదని తెలియచేయడానికి 'నేను మీ కోణాన్ని చూస్తున్నాను' లేదా 'నాకు వేరే కోణం ఉంది' వంటి పదబంధాలను ఉపయోగించమని విద్యార్థులను ప్రోత్సహించాలి. ఒకే అంశంలో భిన్న అభిప్రాయాను కలిగి ఉండటానికి

గల కారణాలను విద్యార్థులు అర్థం చేసుకోవడంలో Illusion గొప్ప పాత్ర పోషిస్తాయి. విద్యార్థులకు ఆప్టికల్ భ్రమ (ఆప్టికల్ Illusion) యొక్క కొన్ని చిత్రాలను చూపించి వాటిలో వారు గమనించింది ఏమిటో చెప్పమనాలి.



ఉదాహరణకు, ప్రక్క చిత్రంలో నలుపు రంగులో ఒక పూలజాడీ ఉంది మరియు తెల్లని రంగుని మనం గమనించినట్లయితే నల్లని రంగులో వున్న పూల జాడీకి ఇరువైపుల రెండు ముఖాలను సూచిస్తుంది. చిత్రంలో పూల జాడీని చూసిన విద్యార్థి తరువాత తెల్లని రంగులో ముఖాలను చూసి అతని స్నేహితులు చెప్పింది కూడా సరైనదేనని విశ్లేషిస్తాడు.




ఏ ఇద్దరి ఆలోచనలు, విషయాలను గ్రహించు విధానం, వారి దృక్కోణం ఒకేలా ఉండదని, అంత మాత్రాన వారు చెబుతున్నది తప్పని భావించాల్సిన అవసరంలేదని, వారితో మర్యాదపూర్వకంగా విభేదించవచ్చని విద్యార్థులు గ్రహిస్తారు.

### 6) సమాజ సేవలో పాల్గొనడం

విద్యార్థులను నెలకు ఒకసారి, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమం, ప్రత్యేక అవసరాల పిల్లల పాఠశాలలను సందర్శించేలా క్షేత్ర పర్యటనను నిర్వహించవలెను. ఇది విద్యార్థులపై చాలా ప్రభావం చూపుతుంది. వారితో సమయం గడపడం, సంభాషించడం, వారి సాధకబాధకాలని తెలుసుకోవడం పిల్లలలో తాదాత్మ్యం పెంపొందించడానికి సహాయపడుతుంది. విద్యార్థుల ఆలోచన విధానాన్ని మారుస్తుంది. వారిలో సేవా భావాన్ని పెంపొందిస్తుంది.

## 1.4.3 ఉపాధ్యాయు సంసిద్ధత

మానవత్వపు విలువను పెంపొందించే ఈ కార్యక్రమాలను నెలకు ఒకసారి ఏర్పాటుచేయవచ్చు. పరోపకారం యొక్క ప్రాముఖ్యతను గ్రహించడంలో, ఇతరులకు సహాయపడాలి అన్న ఆలోచనని రేకెత్తించే చర్యలలో ప్రతి విద్యార్థి పాల్గొనే అవకాశాన్ని ఉపాధ్యాయులు కల్పించాలి. ఈ కార్యక్రమాలు నిర్వహించడానికి అవసరమైన వస్తువులను ముందుగానే సమకూర్చుకోవాలి. పాల్గొన్న ప్రతి విద్యార్థి తన అనుభవాన్ని వ్యక్తపరిచేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. ఈ కార్యకలాపాలను నిర్వహించడానికి పి.ఇ.టి. క్లాసులను ఉపయోగించుకోవచ్చు.

## 1.4.4 విద్యార్థుల ప్రమేయం

తరగతి గదిలో నెలకి ఒకసారి నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలలో విద్యార్థులు చురుకుగా పాల్గొనడానికి ఇష్టపడతారు. రోజువారీ చదువుకునే పాఠ్యాంశాలకి భిన్నంగా ఉండడంచేత వారు ఆసక్తిగా పాల్గొంటారు. వారు వికలాంగులు ఎదుర్కొంటున్న కష్టాలను తెలుసుకోవడానికి మరియు అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తారు. వారికి సహాయం చేయవలసిన అవసరాన్ని విద్యార్థులు గ్రహించి, సానుభూతితో మెలుగుతారు.

### 1.4.5 ప్రక్రియలో ఫలితాలు

- ఇతరులతో మర్యాదగా మాట్లాడవలసిన అవసరాన్ని విద్యార్థులు గ్రహిస్తారు.
- ఒకే విషయంపై ఇద్దరు వ్యక్తుల అభిప్రాయాలలో తేడాలు ఉండవచ్చని విద్యార్థులు అర్థం చేసుకుంటారు.
- విద్యార్థులు ఇతరుల దృక్పథాలను గౌరవిస్తారు.
- వికలాంగులు వారి దైనందిన జీవితంలో ఎదుర్కొంటున్న కష్టాలను విద్యార్థులు అర్థం చేసుకుంటారు.
- వికలాంగులకు సహాయం చేయవలసిన అవసరాన్ని వారు గ్రహిస్తారు.
- ఇతరుల దృక్కోణాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు.
- విద్యార్థులలో మానవత్వం మరియు పరోపకార విలువలు అభివృద్ధి చెందుతాయి.

## 1.5 బాల ఉపాధ్యాయులు

### 1.5.1 అభ్యసన లక్ష్యాలు

1) 'బాల ఉపాధ్యాయులు' ప్రక్రియపై అవగాహన పెంపొందించుకొనుటకు.

2) బోధన – అభ్యసన ప్రక్రియలో 'బాల ఉపాధ్యాయులు' అనే భావనని అనుసరించడానికి.

### 1.5.2 బాల ఉపాధ్యాయులు ఎవరు?

'బాల ఉపాధ్యాయులు' అనే భావనలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు బోధించడం జరుగుతుంది. వారు 10 నుండి 15 నిమిషాలపాటు బోధించడానికి, పాఠ్యపుస్తకంలో నుండి లేదా వారి నిజ జీవితంలోని ఏదో ఒక అంశాన్ని తీసుకోవడం జరుగుతుంది. వారు బోధించాల్సిన అంశాన్ని వివరంగా చదువుకుని, దానిని తోటి విద్యార్థులకు ఎలా బోధించాలో ఒక ప్రణాళిక వేసుకుంటారు. అవసరమైతే ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటారు. వారు బోధనకు అవసరమైన పరికరాలను సేకరిస్తారు. సృజనాత్మకత పద్ధతిలో బోధించడానికి ప్రయత్నిస్తారు. ఈ విధంగా వారి సహచరులకు ఈ భావనను స్పష్టంగా బోధించడానికి క్రమపద్ధతిలో సోపానాలు రాసుకుని, వారికి వివరిస్తారు. ఈ ప్రయత్నంలో భాగంగా బోధించే అంశాలన్నీ లోతుగా విశ్లేషిస్తారు కనుక వారి స్వంత అభ్యాసాన్ని బలోపేతం చేసుకోగలుగుతారు. ఈ ప్రక్రియలో వారికి పాఠాన్ని బోధించడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అర్థమవుతుంది. కరోనా మహమ్మారి కాలంలో బాల ఉపాధ్యాయులుగా విద్యార్థులు తాము బోధిస్తున్న పాఠాన్ని వీడియో రూపంగా ఇతరులతో పంచుకోవడం మనం చూసాము. ఒకరి నుండి ఒకరు నేర్చుకునే ప్రయత్నం వారు చేశారు.

### 1.5.3 ఉపాధ్యాయుల సంసిద్ధత

తమకు ఇష్టమైన ఒక అంశాన్ని తీసుకొని బోధించడానికి విద్యార్థులకు అవకాశాన్ని కల్పించాలి. అవసరమైతేనే ఉపాధ్యాయులు విద్యార్థులు బోధించే అంశాలలో జోక్యం చేసుకోవాలి. ఏదైనా సాధారణ లేదా సామాజిక సమస్య లేదా విషయ సంబంధిత అంశం కేటాయించవచ్చు. విద్యార్థులు సన్నాహం అవ్వడానికి తగినంత సమయం ఇవ్వాలి మరియు వారి ప్రయత్నంలో అవసరమైతే సహాయంచేయాలి. ప్రారంభదశలో ఒక్కరే బోధించడానికి సంశయించే విద్యార్థులకు బృందంగా ఏర్పడి బోధించే వెసులుబాటు కల్పించాలి. వారికి సమానమైన అవకాశాలు కల్పించినప్పుడే ఈ ప్రక్రియవల్ల కలిగే ప్రయోజనాన్ని చూడగలము. ఉపాధ్యాయుడు సహనం కలిగి ఉండాలి మరియు విద్యార్థులకు తమపై తమకు నమ్మకం కలిగేవరకు మార్గనిర్దేశం చేయాలి. బాల ఉపాధ్యాయుడు బోధించునప్పుడు ఉపాధ్యాయుడు వీడియో తీసి, దానిని వారి తరగతి వాట్సప్ గ్రూపులో ప్రశంసిస్తూ పంచుకోవచ్చు. తాము తోటి విద్యార్థులకు పాఠం చెపుతున్న వీడియో తల్లిదండ్రులకు చూపడానికి విద్యార్థులు ఆసక్తిని కనబరుస్తారు. ఎంతో ఉత్సాహంతో తమ తదుపరి పాఠాన్ని ఇంకా మెరుగ్గా బోధించడానికి ప్రయత్నిస్తారు.

### 1.5.4 విద్యార్థుల ప్రమేయం

చదువులో కాస్త చురుకుగా ఉన్న విద్యార్థులు సాధారణంగా తమకు తాముగా ఉత్సాహంగా ముందుకు వస్తారు. మొదట్లో సంకోచించే ఇతర విద్యార్థులు, వారి స్నేహితుల నుండి ప్రేరణ పొందుతారు. తమ తోటి విద్యార్థుల నుండి మరియు ఉపాధ్యాయుల నుండి లభించే ప్రేరణతో వారి భయాలను అధిగమించడానికి ప్రయత్నిస్తారు మరియు తమ తోటి విద్యార్థులకు, బాల ఉపాధ్యాయులుగా బోధనలో పాల్గొంటారు. పిల్లలు వారి క్లాస్‌మేట్స్ నుండి నేర్చుకుంటున్నప్పుడు మరియు వారితో సంభాషించేటప్పుడు చాల సౌకర్యంగా భావిస్తారు.

### 1.5.5 ప్రక్రియలో ఫలితాలు

- విద్యార్థులలో మానసిక మరియు సామాజిక నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి.
- విద్యార్థుల ఆత్మవిశ్వాసం మెరుగుపడుతుంది. పాఠశాలలో జరిగే వివిధ పోటీలలో పాల్గొనడానికి ఉత్సాహం కనబరుస్తారు.
- విద్యార్థులలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపడుతాయి.
- విద్యార్థులు ఏ విషయాన్నైనా లోతుగా తెలుసుకునే ప్రయత్నం చేస్తారు.
- బోధించే ప్రక్రియలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి విద్యార్థులకు బాగా అర్థం అవుతుంది.
- ఉపాధ్యాయులపై గౌరవం పెరుగుతుంది.
- విద్యార్థులకు అనుకూల మరియు చురుకైన అభ్యాస వాతావరణాన్ని సృష్టిస్తుంది.

## 1.6 ముగింపు

విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడే బోధన విధానాలు అనుసరించడం వల్ల సమాజానికి బాధ్యతాయుతమైన పౌరులని అందించగలము.

## 1.7 సంప్రదింపు గ్రంథాలు

1) పాఠ్యప్రణాళిక, అభ్యాస కేంద్రీకృత బోధన, అభ్యాస ఫలితాలు మరియు సమగ్రబోధన.

2) మీ తరగతి గదిలో తాదాత్మ్యం : Teachersguide.org

3) నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ – 2020.

4) పాత్వే 2 సక్సెస్ (Pathway 2 Success)

5) SEL : తాదాత్మ్యం కార్యకలాపాలు.

## 1.8 కృత్యాలు

1) మీ చిన్నతనంలో మీపై ప్రభావం చూపిన చలన చిత్రం పేరు రాయండి.

2) తోటివారి సంతోషం లేదా విచారంతో మీరు అనుభూతి చెందిన సందర్భం గురించి రాయండి.

3) మీలో మానవత్వాన్ని బలోపేతం చేయగల కొన్ని మార్గాలను రాయండి.

4) పిల్లలలో మానవత్వ విలువలని పెంపొందించే కొన్ని ప్రక్రియలను సూచించండి.

5) బాల ఉపాధ్యాయులు మీ సబ్జెక్టులో బోధించే అవకాశం ఉన్న ఐదు అంశాలను రాయండి.

## 1.9 మదింపు

1) పాఠశాల బోధన సమయాన్ని వృథాగాకుండా ప్రధానోపాధ్యాయుడుగా తాను, తన పాఠశాల ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఉత్తమమైన మార్గం. ( )

A) ఫేస్ టు ఫేస్ శిక్షణ

B) వృత్తి పూర్వ శిక్షణ

C) ఆన్‌లైన్ శిక్షణ

D) కాంటాక్ట్ తరగతుల ద్వారా శిక్షణ

2) క్రింది వానిలో 21వ శతాబ్దపు నైపుణ్యం కానిది ( )

A) విశ్లేషణాత్మక ఆలోచన

B) సృజనాత్మకత

C) భావవ్యక్తీకరణ

D) వల్లెవేసి చెప్పడం

3) మూవీక్లబ్ లాంటి వేదికలను పాఠశాలలో ప్రవేశపెట్టిన, విద్యార్థులలో క్రింది అవకాశం కల్గిస్తుంది. (   )

A) కేవలం వినోదానికి ప్రాధాన్యత ఇస్తుంది

B) క్రమశిక్షణ లోపిస్తుంది

C) ఎలాంటి సంకోచంలేకుండా తమకుతాము వ్యక్తం చేసుకునే అవకాశం ఉంటుంది

D) ఒకరిపట్ల ఒకరికి మనస్పర్థలు కలిగిస్తాయి

4) విద్యార్థులలో మానవత్వాన్ని పెంపొందించే చర్యలలో ముఖ్యమైనది (   )

A) సానుభూతి చూపటం

B) అవతల వ్యక్తులపట్ల తాదాత్మ్యం పొందడం

C) ఒకరి కష్టాలను వినడం

D) పరస్పర చర్చలు జరుపుకోవడం

5) విషయాన్ని లోతుగా అవగాహన చేసుకునే అవకాశం ఈ క్రింది ప్రక్రియలో బాగా సాధ్యపడుతుంది.(   )

A) ఉపాధ్యాయుని బోధన

B) దృశ్య శ్రవణ సాధనం ద్వారా

C) విద్యార్థులు పరస్పర చర్చల ద్వారా

D) బాల ఉపాధ్యాయుల ప్రక్రియ ద్వారా